సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 15 । జూలై । 2023



ఉన్నత ఉద్యోగమే లక్ష్యం 8లో
డిగ్రీతోనే చదువులు ఆపేయకుండా ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా కృషి చేయాలని ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ సూచించారు.



'ఆడుదాం ఆంధ్రా'పై విస్తృత ప్రచారం
'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను డీఆర్వో అంబేడ్కర్ ఆదేశించారు. 8లో



చట్టాలపై అవగాహన అవసరం
యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అరకులోయ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎం.శివకిరణ్ సూచించారు. 8లో

న్యూస్‌రీల్

వరద ముందస్తు జాగ్రత్తలపై నేడు సమీక్ష

- కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం

చింతూరు: రానున్న వరదలకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వరదలు సంభవిస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు ఆయా మండలాల్లో నిత్యావసర సరకులను ముందుగానే నిల్వ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడంలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేసే అవకాశముంది. వరదలపై సమీక్ష సమావేశం నేపథ్యంలో శనివారం చింతూరులో నిర్వహించాల్సిన పోలవరం నిర్వాసితుల గ్రామసభను వాయిదా వేసినట్లు తహసీల్దార్ కారం సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

హుండీ ఆదాయం రూ.5.45 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

దేవీపట్నం: మండలంలోని పూడిపల్లి పంచాయతీలో అఖండ గోదావరి నది ఒడ్డున గల గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని శుక్రవారం మధ్యాహ్నం లెక్కించారు. గోదావరి నది ఎగువప్రాంతాల నుంచి పోటెత్తడంతో పోశమ్మ ఆలయం వద్ద వరద నీరు భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయం నీటమునిగే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం హుండీల ఆదాయాన్ని లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో ఆరు హుండీల ద్వారా మూడు నెలల 20 రోజుల కాలానికి రూ.5,45,127ల ఆదాయం సమకూరినట్లు ఈవో జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు. ఎంపీపీ కుంజం మురళి, తాళ్లూరు ఈవో రాజేష్, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ కలుం నర్సయమ్మ,, బ్యాంక్ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు.

డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలు

- రూ.1.52 కోట్లు పంపిణీ



రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: జిల్లాలోని అరకులోయ మండలానికి సంబంధించి 120 స్వయం సహాయక సంఘాలకు రూ.1.52 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన చెక్కును జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పంపిణీ చేశారు. ఈ రుణాల సొమ్మును సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని డ్వాక్రా సంఘాల సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఏపీఎంలు, మహిళలు పాల్గొన్నారు.

చంద్రయాన్-3పై విద్యార్థులకు అవగాహన



చంద్రయాన్-3 ప్రయోగ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

కొయ్యూరు: మండలంలోని డౌనూరు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం చంద్రయాన్-3 ప్రయోగం ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులకు చూపించారు.ప్రయోగం విజయవంతం కావడంతో ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందనలు తెలుపుకున్నారు. భారత మాతాకు జై..వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చంద్రయాన్-3కు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

గోస్తనీ కష్టాలు గట్టెక్కినట్టే!

గోస్తనీ నదిపై వంతెనల నిర్మాణాలు చురుగ్గా సాగుతుండటంతో అల్లూరి, విజయనగరం జిల్లాల సరిహద్దుల్లోని సుమారు 60 గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మారుమూల గ్రామాలకు రాకపోకలు సమస్య తలెత్త కూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

- సారవానిపాలెం, జీలుగులపాడు వద్ద వంతెనల నిర్మాణం
- రూ.4.20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- చురుగ్గా పనులు
- 60 గ్రామాల ప్రజల్లో ఆనందం



గోస్తనీ నదిపై నిర్మిస్తున్న జీలుగులపాడు వంతెన



గోస్తనీ నదిపై నిర్మిస్తున్న సారవానిపాలెం వంతెన

అనంతగిరి: మండలంలోని గోస్తనీ నది దాటాలంటే ప్రాణాలకు తెగించాల్సిందే. వర్షాకాలం వచ్చిందంటే చాలు నదిని దాటేందుకు సుమారు 60 గ్రామాల గిరిజనులు అవస్థలు పడుతుంటారు. నది ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా వారు ఇళ్లకు పరిమితం కావాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రాణాలకు తెగించి వెళ్తుంటారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. గోస్తనీ నదిపై వంతెనల నిర్మాణానికి ఎస్ఎస్‌పీ గ్రాంటుతో రెండు వంతెనలకు నిధులు మంజూరు చేయించడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

సారవానిపాలెం వద్ద..

సారవానిపాలెం సమీపంలోని గోస్తనీ నదిపై వంతెన లేకపోవడం వల్ల సుమారు పది గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించే దిశగా ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేయడంతో ఆయా గ్రామాల గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జీలుగులపాడు వద్ద..

జీలుగులపాడు వద్ద గోస్తనీ నదిమీదుగా అల్లూరి జిల్లాతోపాటు విజయనగరం జిల్లాకు చెందిన సుమారు 50 గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతం. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఇదే ప్రాంతంలో వంతెన నిర్మాణానికి రూ.2.2కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయితే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

సమస్య శాశ్వత పరిష్కారం



ఆయా గ్రామాల్లో పర్యటించినప్పుడు గిరిజనులు పడుతున్న సమస్యలను స్వయంగా చూసి, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చా. ప్రభుత్వం చొరవతో రెండు వంతెనలకు నిధులు మంజూరయ్యాయి. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే


త్వరితంగా పూర్తికి చర్యలు

గోస్తనీ నదిపై సారవానిపాలెం, జీలుగులపాడు వద్ద రెండు వంతెనల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే త్వరితగతిన వంతెనలను అందుబాటులోకి వచ్చేలా కృషిచేస్తున్నాం. వంతెనలు పూర్తయితే జిల్లా సరిహద్దులోని సుమారు 60 గ్రామాలకు మేలు జరుగుతుంది.

– గణేష్, ఏఈ, ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి

రాజ్‌మా రైతులకు శుభవార్త

- ఈ ఏడాది కూడా 90 శాతం రాయితీపై విత్తనాలు
- 18,212 ఎకరాలకు 4,553 క్వింటాళ్ల సరఫరాకు ఏర్పాట్లు
- వచ్చే నెల మొదటి వారం ఆర్‌బీకేల్లో పంపిణీ



రాజ్‌మా విత్తనాలు

సాక్షి,పాడేరు: రాజ్‌మా రైతులకు ఈ ఏడాది కూడా ప్రభుత్వం 90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో రాజ్‌మాను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆగస్టు మూడవ వారంలో విత్తనాలు జల్లుకుని, డిసెంబర్ నెలాఖరుకు దిగుబడి వచ్చేలా సాగు చేస్తుంటారు. గిరిజనులకు సిరులు కురిపించే ఈ పంటకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల నుంచి 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తోంది. జిల్లాలో 18,212 ఎకరాలకు అవసరమైన 4,553 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా వచ్చే నెల మొదటి వారం నుంచి ప్రభుత్వం అందజేయనుంది. గిరిజనులు సాగు చేపట్టే గడువుకు ముందస్తుగానే సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది.

ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా



రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది కూడా 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను గిరిజన రైతులకు పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఏపీ సీడ్స్ ద్వారా అన్ని రైతుభరోసా కేంద్రాలకు విత్తనాలను సరఫరా చేస్తాం. ఆగస్టు మొదటి వారంలో ముందస్తుగానే రాజ్‌మా విత్తనాలను అర్హులైన గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పారదర్శకంగా పంపిణీ చేస్తాం.

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

ఆస్పత్రిలో ఉన్నా పింఛను అందుకున్నా..

ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు తుర్రం మంగమ్మ. ఈమె స్వగ్రామం వేగితోట. ఈమె ఇటీవల వంట చెరకు నిమిత్తం సమీపంలోని అటవీప్రాంతానికి వెళ్లింది. ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో కాలు విరిగింది. దీంతో ఆమె తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పింఛను ఇచ్చేందుకు ఆమె ఇంటికి వెళ్లిన వలంటీరు లక్ష్మి విషయం తెలుసుకుంది. వెంటనే భద్రాచలం ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ వల్లే ఈ రోజు ఆస్పత్రిలో ఉన్నా పింఛను అందుకోలిగా... వలంటీర్ లక్ష్మి సొంత ఖర్చులతో నేరు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వచ్చి పింఛను ఇచ్చింది. ఈ మొత్తం వైద్యానికి ఎంతగానో ఉపయోగపడిందని వృద్ధురాలు మంగమ్మ సంతోషంగా చెప్పింది.

– చింతూరు



భద్రాచలం ఆస్పత్రిలో మంగమ్మకు పింఛను నగదు అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి

స్పందనకు వినతుల వెల్లువ

ఐటీడీఏలో గిరిజనుల నుంచి 155 స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 155 వినతులను జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి స్పందన వినతులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేడ్కర్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, పలు విభాగాల ఇంజనీరింగ్ శాఖల అధికారులు డీవీఆర్‌ఎం రాజు, వేణుగోపాల్, బాలసుందరబాబు, లావణ్యకుమార్, లీలాకృష్ణ, కొండయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- మండల కేంద్రమైన చింతపల్లిలోని చాడిపేటలో తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు సామాజిక భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు గెమ్మెలి మహేష్,రామన్న కోరారు.
- చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీలోని వెదురుపల్లి గ్రామం నుంచి తామరాపల్లి గ్రామం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు లక్ష్మణరావు, బిర్సన్న కోరారు.
- అరకులోయ మండలం బొండం పంచాయతీ జాంగూడ గ్రామానికి తాగునీరు, విద్యుత్, రోడ్డు సదుపాయాలు కల్పించాలని అదే ప్రాంతానికి చెందిన కిల్లో రాంబాబు, కిల్లో చిట్టిబాబు కోరారు.
- తొట్టిడిపుట్టు నుంచి తాడివీధి వరకు రోడ్డు నిర్మించాలని పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ తాడివీధి గిరిజనులు వెంకటరావు, నవీన్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.
- డుంబ్రిగుడ మండలం అరకులో లోవోల్టేజీ వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ మార్చి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీటీసీ వరహాలమ్మ కోరారు.
- డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ జర్రాయి నుంచి బుడ్డింగి గ్రామానికి, జర్రాయి నుంచి బల్దాగెడ్డ వరకు రోడ్లు నిర్మించాలని సర్పంచ్ కమల, వార్డు సభ్యులు సీత కోరారు.
- గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని జి.మాడుగుల మండలం సంతబయలుకు చెందిన సరోజిని వినతి పత్రం అందజేశారు.

సురక్షలో 6,704 ధ్రువపత్రాల పంపిణీ : కలెక్టర్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 14 మండలాల పరిధిలోని 22 సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.18,854 గృహాల్లో ఇటీవల వలంటీర్లు సర్వే నిర్వహించగా వివిధ ధ్రువపత్రాలకు 16,641 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్నారు. వీటిలో16 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 6,704 ధ్రవపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. మిగిలిన 9,926 ధ్రువపత్రాలన రెండు రోజుల్లోగా పంపిణీ పూర్తి చేస్తారని ఆయన వెల్లడించారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పోస్టుమాస్టర్ జనరల్ కల్నల్ రాములు

అరకులోయ టౌన్: తపాలాశాఖ ప్రవేశపెట్టిన పలు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పోస్టుమాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు తెలిపారు. అరకులోయలో పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి భవన పరిశీలనకు శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పదేళ్ల వయసు గల చిన్నారులకు సుకన్య సమృద్ధి పథకంలో చేరితే 20 సంవత్సరాల తరువాత మంచి వడ్డీతో పెద్ద మొత్తం పొందవచ్చన్నారు. మహిళలు రూ.లక్షలు డిపాజిట్ చేస్తే రెండేళ్ల తరువాత రూ.32 వేల వడ్డీతో మొత్తం సొమ్ము పొందవచ్చన్నారు. కేవలం రూ.399 చెల్లిస్తే ప్రమాదంలో మరణించినా, శాశ్వత వైకల్యం ఏర్పడినా రూ.10 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. వన్ జన్ ధన్ స్కీమ్ కూడా ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతీ ఇంటికి పోస్టల్ సేవలు అందించాలన్న లక్ష్యంతో అందుకు ఖాతాలు తెరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అరకులోయ సబ్ పోస్టల్ కార్యాలయంలో ఇన్వెర్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



పోశమ్మగండి వద్ద నిలిచిన పర్యాటక బోట్లు



గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరిన గోదావరి వరద నీరు

దేవీపట్నం : ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు కారణంగా దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద గోదావరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది. నదీపరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా కొండవాగుల నుంచి వరద నీరు చేరికతో గోదావరి నీరు ఎరుపెక్కింది. పోలవరం ప్రాజెక్టు కారణంగా పోశమ్మగండి వద్ద బ్యాక్ వాటర్ గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం సుమారు పది అడుగుల మేర పెరిగింది. గండిపోశమ్మ ఆలయ ప్రాంగణం వరకూ వరదనీరు పోటెత్తింది. ఇదేస్థాయిలో పెరిగితే శనివారం ఉదయానికి అమ్మవారి ఆలయంలోకి వరద నీరు చేరే అవకాశం ఉంది.

ఆలయ అధికారులు అప్రమత్తం : గోదావరి ఒక్కసారిగా పెరగడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. అమ్మవారి ఆలయంలోని హుండీలు నీటమునిగే ప్రమాదమున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయంలోని హుండీల లెక్కింపు చేపట్టారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గోదావరి పోటు కారణంగా పోశమ్మగండి నుంచి పేరంటపల్లికి వెళ్లే పాపికొండల బోట్లను అధికారులు నిలిపివేశారు. దీంతో బోట్లన్నీ పోశమ్మగండి వద్ద ఒడ్డుకు పరిమితమయ్యాయి.

గండిపోశమ్మ ఆలయాన్ని తాకిన వరదనీరు

నిలిచిన రాకపోకలు : దండంగి వాగు వద్ద వరద నీరు పోటెత్తడంతో దండంగి, చినరమణయ్యపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. దండంగి– పురుషోత్తపట్నం ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు చేరడంతో దండంగి నుంచి పోశమ్మగండికి రహదారి బంద్ అయ్యింది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన దండంగి, పూడిపల్లి పోశమ్మగండి, నాగళ్లపల్లి, దేవీపట్నం తదితర గ్రామాల్లోని పొలాల్లోకి వరదనీరు చేరింది. ముంపు గ్రామాలన్నింటికి పునరావాసం కల్పించి ఇదివరకే ఖాళీ చేయించడంతో గోదావరి వరద ఇబ్బందులు తప్పాయి. గోదావరి వరదల సీజన్‌లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వర్షాకాలం వెళ్లేంతవరకూ పోశమ్మగండి వద్ద వరద నీరు తగ్గే అవకాశాలు తక్కువే.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా..

- గద్వేల్ యువకుడి సైకిల్ యాత్ర
- ఇప్పటివరకు 12 వేల కిలోమీటర్ల మేర పర్యటన



సైకిల్‌యాత్రలో భాగంగా రాజవొమ్మంగి చేరుకున్న సిద్దార్థ

రాజవొమ్మంగి: ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంతో తెలంగాణలోని గద్వాల్ జిల్లాకు చెందిన యువకుడు సిద్దార్థ సైకిల్‌పై చేపట్టిన చైతన్య యాత్ర శుక్రవారం ఇక్కడికి చేరుకుంది. గతేడాది ఆగస్టు 29న ఢిల్లీలో ప్రారంభించిన యాత్ర ఇప్పటివరకు 12వేల కిలోమీటర్ల మేర సాగిందని ఇందుకుగాను రూ.2లక్షలు ఖర్చయిందని తెలిపాడు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్, బాలికా స్వేచ్ఛ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య వంతులను చేస్తున్నట్టు తెలిపాడు. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, లఢాక్, జమ్ము కాశ్మీరు, ఉత్తరాఖండ్, యూపీ, బీహార్, సిక్కిం, నార్త్ ఈస్ట్ స్టేట్స్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా మీదుగా సౌత్ ఇండియా మొత్తం తిరిగినట్టు చెప్పారు. కేరళ, కర్ణాటక, ఏపీ పూర్తి చేసిన తరువాత తెలంగాణకు చేరతానన్నాడు.

నేటి సమాజంలో పక్క గ్రామం వెళ్లాలన్నా మోటారుబైక్‌లు, కార్లు వాడుతున్నారు.. అది మానుకుని సైకిల్ అలవాటు చేసుకోవాలని ప్రజలకు చెబుతూ దీనివల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నట్టు సిద్దార్థ తెలిపాడు. డీజిల్, పెట్రోల్ వాహనాల వల్ల కలిగే అనర్థాలను కూడా ప్రజలు వివరిస్తున్నానని చెప్పాడు. జిల్లా కలెక్టర్‌ను కలసి తన యాత్ర అనుభవాలను తెలియజేస్తానని తెలిపాడు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమ పెట్టాలని ఉద్దేశం ఉందని తెలిపాడు. వ్యవసాయం ప్రాధాన్యతను అందరికి తెలపాలన్నదే తన కోరిక అని పేర్కొన్నాడు. వ్యవసాయ రంగంలో టెక్నాలజీ పాత్ర పెంచేందుకు పట్టణాల్లో ఉండి చదువుకున్న యువత.. పల్లెలో ఉండే రైతన్నలకు మధ్య సాన్నిహిత్యాన్ని పెంచాలన్నది కూడా తన ఆలోచనగా వివరించాడు.

ఘనంగా శాకంబరి ఉత్సవం

- ప్రత్యేక అలకంరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- వాసవీమాత, సరస్వతీదేవి, ధారాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



శాకంబరి అలంకరణలో వాసవీమాత, సరస్వతీదేవి



ధారాలమ్మ తల్లికి కూరగాయలతో అలంకరణ

సాక్షి,పాడేరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన వాసవీమాత,సరస్వతిదేవి విగ్రహాలకు పట్టణంలోని ఆర్యవైశ్యులు శుక్రవారం ఘనంగా శాకంబరి ఉత్సవం నిర్వహించారు. విగ్రహాలను కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవార్లు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు విగ్రహాల వద్ద దీపార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్,వాసవి హిల్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనాథుని శ్రీను, శర్మ, శిరీషా, మణి, సంతోష్, రమేష్, మణి, శ్రావణి, గౌతమి పాల్గొన్నారు.

సీలేరు : ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ తల్లిని ఆషాఢమాసం శుకవారం శాకంబరి అమ్మవారిగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ధారకొండ గ్రామానికి చెందిన అనుముల శెట్టి శ్రీను, లక్ష్మి దంపతులు పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అన్నదానం నిర్వహించారు. ధారకొండకు చెందిన బాల భక్త భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు


నిందితుడితో సీఐ రుద్రశేఖర్,ఎస్ఐ సంతోష్

అరకులోయ టౌన్: పరారీలో ఉన్న గంజాయి నిందితుడిని అరెస్టు చేసినట్టు అరకులోయ సీఐ సీహెచ్. రుద్రశేఖర్ తెలిపారు. 2021లో 150 కిలోల గంజాయి తరలింపులో సహకరించిన అరకులోయకు చెందిన ముతెం రవి(30) అప్పటి నుంచి పరారీలో ఉన్నాడని చెప్పారు. అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమవేశంలో ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఇద్దరు 'హౌసింగ్' ఉద్యోగులపై కేసు

మునగపాక: హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఇద్దరు ఉద్యోగులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి సామగ్రి లావాదేవీల్లో తేడాలున్నట్టు హౌసింగ్ పీడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలతో ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కమిటీ సభ్యులు చేపట్టిన విచారణలో రూ.19,63,970 మేర అవినీతి చోటు చేసుకున్నట్టు నిర్ధారణ జరిగిందన్నారు. ఇందుకు కారకులైన కంప్యూటర్ ఆపరేటర్ అర్జున్,వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినాష్‌లపై చర్యలు తీసుకోవాలని డీఈ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అలీ తెలిపారు.

పశుగ్రాసం సాగుతో లాభాలు


అరకులోయలో అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు


చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ చంద్రశేఖర్

అరకులోయ రూరల్: పశుగ్రాసం సాగు చేసి లాభాలు పొందవచ్చని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరసింహులు చెప్పారు. మండలంలోని చొంపి పంచాయతీ కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పశువుల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశుగ్రాసం సాగుపై యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పశువుల మేతకులను అవసరమైన గడ్డిని పెంచేందుకు నూతన పద్ధతులు పాటించాలన్నారు, ఆవులు, గేదెలకు ఎక్కువగా ప్రొటీన్ ఇచ్చే గడ్డిని అందజేయడంతో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పారా గడ్డి, హైబ్రిడ్ నేపియర్, సూపర్ నేపియర్ తదితర జాతుల గడ్డి పెంపకంతో హెక్టారుకు 400 టన్నుల దిగుబడి వస్తోందన్నారు.

ఔత్సాహిక రైతులు ముందుకు వస్తే పశుసంవర్థక శాఖ ద్వారా సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. పశు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాసం సాగు పద్ధతులను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పశువైద్యాధికారులు సీనయ్య, గణేశ్వరరావు, సందీప్, గౌతమ్, పశుసంవర్ధకశాఖ సహాయకులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: పశుగ్రాసం సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఆయన మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించారు. పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందజేయడంతో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఫలితంగా రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రతి పశువుకు రోజుకు 25 కిలోల గడ్డి అవసరమవుతుందన్నారు. పశుగ్రాసం కోసం జొన్న, పిల్లిపెసర సాగు చేసుకోవచ్చన్నారు. సీలేరు వైద్యాధికారి రాజశేఖర్, ఎల్.ఎస్.ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఉద్యోగమే లక్ష్యం

● ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ

సాక్షి, పాడేరు: డిగ్రీతోనే చదువులు ఆపేయకుండా పోటీ పరీక్షలు, సివిల్స్, ఇతర ప్రతిభా పరీక్షలలో సత్తా చాటి ఉన్నత ఉద్యోగాల లక్ష్యం సాధించాలని ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ సూచించారు. పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సౌకర్యాలను అందుబాటులో ఉంచిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని కోరారు.ఉన్నత చదువులు, ఉద్యోగాలతో పేదరికాన్ని కూడా జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపల్ రసూల్, ఐక్యూ కోఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు శంకరావు, అచ్యుత్, లావణ్య, జీవన్‌జ్యోతి, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్, శంకరరావు,అమిత్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై విస్తృత ప్రచారం

డీఆర్వో అంబేడ్కర్

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి జిల్లాలో విజయవంతం చేయాలని డీఆర్వో అంబేడ్కర్ విద్యాశాఖ, క్రీడల అభివృద్ధి విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అక్టోబర్ రెండు గాంధీ జయంతి సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.17 సంవత్సరాలు పైబడిన యువతీ,యువకులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరుగుతాయన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై గ్రామ స్థాయిలోనే విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.ఈక్రీడా పోటీలకు ఆసక్తి ఉన్న యువతీ,యువకులంతా గ్రామసచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈవో సలీంబాషా,సాంఘిక సంక్షేమాధికారి జనార్దనరావు,డీఎల్‌డీవో శాంత లక్ష్మి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి ప్రోత్సాహం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ రహీమ్

ఆనందపురం: ప్రధానమంత్రి, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏడీ ఎం.రహీం చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ ఈ పథకం కింద బియ్యం, మామిడి, జీడిపప్పు, పసుపు, మిరప, చిరుధాన్యాలు, పాలు, చేపలు, సముద్ర ఉత్పత్తులు వంటి వాటి ద్వారా వ్యాపారాలు చేయాలనుకునే వారు అర్హతను బట్టి ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం రాయితీ, 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. 10 శాతం లబ్ధిదారుడు పెట్టుబడిగా ఉండాలన్నారు. ఆర్థిక తోడ్పాటుతో పాటు సాంకేతిక శిక్షణ అందించి ఉత్పత్తులు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో గానీ, జిల్లా అధికారులకు నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అవగాహన సదస్సుకు 55 మంది హాజరు కాగా.. 12 మంది యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, ఉద్యానవన శాఖ అధికారి సోని, పశు వైద్యాధికారిణి లీలారాణి, డీఆర్‌డీఏ ఏసీ నాయుడు, డీపీవో వైదేహి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారి రమేష్, డీఆర్పీ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం


మల్లవరం వద్ద ప్రమాద స్థలంలో అచ్చియ్యనాయుడి మృతదేహం

నర్సీపట్నం/యలమంచిలి: జిల్లాలో రెండు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నర్సీపట్నం మున్సిపాలిటీ కృష్ణాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన పి.వెంకటరమణ(56) అనే వ్యక్తి మరణించాడు. అచ్యుతాపురంలోని ప్రైవేట్ కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తున్న వెంకటరమణ. శుక్రవారం స్నేహి తుడితో కలిసి బైక్‌పై నాతవరం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. బైక్, కారు ఢీ కొనడంతో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా అత్యవసర వైద్య సేవలు అందించి మెరుగైన వైద్య సేవలకు విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేష్ తెలిపారు.

యలమంచిలి మండలం మల్లవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యలమంచిలి పట్టణం ధర్మవరానికి చెందిన దండా వెంకట అచ్చియ్యనాయుడు (50) మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. అచ్చియ్యనాయుడు తుని నుంచి స్కూటీపై ధర్మవరానికి శుక్రవారం సాయంత్రం వస్తుండగా లైనుకొత్తూరు శివారు మల్లవరం వద్ద వాహనం అదుపు తప్పడంతో కిందపడిన ఆయన తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో దుక్కిటెద్దు మృతి


మృతి చెందిన దుక్కుటెద్దు

వై.రామవరం: మండలంలోని దాలిపాడు సచివాలయం పరిధిలోని పులుసుమామిడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం విద్యుత్‌షాకుతో ఓ దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామంలోని రామాలయం సమీపంలోని ఓ విద్యుత్ స్తంభం ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడున్న ఎద్దు అకస్మాత్తుగా షాక్‌కు గురైనట్టు పశు యజమాని డొక్కా అచ్చిరెడ్డి చెప్పారు. సుమారు రూ.20 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంకటనగరం బీచ్‌లో 'భీమా' షూటింగ్


సముద్ర తీరంలో చిత్రీకరణ

పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం సముద్ర తీరంలో భీమా సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై ప్రొడ్యూసర్ కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో గోపీచంద్‌పై డైరెక్టర్ ఎ.హర్ష పలు సన్నివేశాలు చిత్రీకరించారు. కథానాయకగా మాళవిక శర్మ నటిస్తోంది. ఈ సినిమాలో గోపీచంద్ పోలీసు పాత్రలో నటిస్తున్నాడని ప్రొడక్షన్ మేనేజర్ బాబీ తెలిపారు. ఇటీవల రంపచోడవరంలో పది రోజులపాటు షూటింగ్ పూర్తి చేసుకుని ఇక్కడ ఐదు రోజులపాటు రాత్రిళ్లు ఫైటింగ్ సీన్లు చిత్రీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సి.ఐ. పి.అప్పలరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఐదుగురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

60 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసులకు పట్టుబడిన అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లు

కొయ్యూరు: ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి రాజస్థాన్‌కు గంజాయి తరలిస్తున్న ఐదుగురు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను శుక్రవారం అరెస్టు చేసి, 60 కిలోలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ స్వామినాయుడు చెప్పారు. ముందస్తు సమాచారం మేరకు కొయ్యూరు ఎస్ఐ రాజారావు,మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ కాకరపాడులో వాహనాల తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ సమయంలో బూదరాళ్ల రహదారి నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 60 కిలోల గంజాయి బయటపడింది. రాజస్థాన్‌కు చెందిన భూరం పురోహిత్, జాట్ ప్రవీణ్‌కుమార్, ఒడిశా రాష్ట్రం చిత్రకొండకు చెందిన గెమ్మెల నాగేశ్వరరావు, పాంగి సుబ్బు, వంతల శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. నిందితుల నుంచి ఓ కారు, ఓ ఆటోను, రూ.1.06 లక్షల నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు


రంపచోడవరంలో వైద్యులు అనూష, తేజ్‌లను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎస్ఐలు

గంగవరం: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష , పీహెచ్‌సీ వైద్యుడు ఆనంద్ సత్యతేజలను ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఏడీఎంహెచ్ఓగా డాక్టర్ అనూష అందించిన సేవలు మరవలేరన్నారు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ కోవిడ్ కష్టకాలంలో ఇరువురు వైద్యులు విశేషమైన వైద్యసేవలు అందించారని కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు పలికినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్ భాషా, ఎస్ఐ చిన బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అరకులోయ ఇన్‌చార్జి జడ్జి శివకిరణ్


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయ రూరల్: యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అరకులోయ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎం.శివకిరణ్ సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం న్యాయశాస్త్ర విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సమాజంలో పరిణామాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. చదువుతో పాటు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉంటేనే సమాజమార్పునకు దోహదపడుతుందన్నారు. సరియైన అవగాహన లేని కొంతమంది చెడుమార్గంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జైలు పాలవుతున్నారన్నారు. నేటి యువతే రేపటి పౌరులుగా విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. చదువుతోనే ప్రతీ విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు సాధ్యమన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు టీపీ నాయుడు, మురళీ మోహన్, రాంబాబు, సింహాచలం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీపై విచారణ


కైలాసపట్నంలో వినియోగదారులను విచారిస్తున్న సేల్స్ ఆఫీసర్ ఉమాదేవి

కోటవురట్ల: శ్రీరాజగోపాల ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు అందడంతో ఐవోసీ ఏరియా సేల్స్ ఆఫీసర్ ఉమాదేవి శుక్రవారం విచారణ జరిపారు. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, గొడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ ఆమెను కలిసి అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. మాండేటరీ చెకప్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.150 చొప్పున వసూలు చేశారని, ఇలా మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో సుమారు 12 వేల మంది వినియోగదారుల నుంచి వసూలు చేశారని చెప్పారు. వినియోగదారులను విచారణ చేయాలని డిమాండ్ చేయడంతో సేల్స్ ఆఫీసర్ ఉమాదేవి కైలాసపట్నంలో వినియోగదారులను కలిసి విచారణ జరిపారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి వచ్చిన నలుగురు వ్యక్తులు గ్యాస్ స్టవ్, పైప్, ఇతర సేఫ్టీ అంశాలు తనిఖీ చేయకుండా రూ.150 చొప్పున వసూలు వారు తెలిపారు. గత నాలుగేళ్లుగా గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేసినప్పుడు కంపెనీ ధర కంటే అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని సేల్స్ ఆఫీసర్ తెలిపారు. మాండేటరీ చెకప్ చేయకుండా వసూలు చేసిన నగదును రకవరీ చేసి అందరికీ అందజేస్తామని చెప్పారు.